సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 1 । జూలై । 2025



టన్ను చీనీ రూ.28,200
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,800, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



బదిలీల నరకయాతన
బదిలీల కౌన్సెలింగ్ మహిళా పోలీసులకు నరకం చూపింది. అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో చంటిబిడ్డలతో వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.9°/22.4°
జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సంక్షేమ పథకాల అమలుపై శ్రద్ధ చూపాలి



ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన.. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పీజీఆర్ఎస్, హౌసింగ్, పౌర సరఫరాలు, నీటి పన్నులు తదితర అంశాలపై ఆర్డీఓలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా సర్వే అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలన్నింటికీ సరైన పరిష్కారం చూపాలన్నారు. రైతు భరోసా, తల్లికి వందనం కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జూలై నెలాఖరులోపు రేషన్ కార్డుల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఎల్ఎస్ గోడౌన్లను తనిఖీ చేయాలన్నారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

చెన్నేకొత్తపల్లి: పొలంలో పురుగుల మందు పిచికారీ చేసి ఇంటికి వచ్చిన రైతు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని న్యామద్దల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ (53) మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం పంటకు రసాయన మందు పిచికారీ చేసి మధ్యాహ్నం వేళ ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం చెన్నేకొత్తపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య వరలక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. కాగా, పంటలకు రసాయన ఎరువులు పిచికారీ చేసే సమయంలో, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గూగూడులో కొలువు తీరిన పీర్లు



నార్పల: మండల పరిధిలోని గూగూడు మోహర్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయంలో పీర్లు కొలువు తీరాయి. ఈ సందర్భంగా ఆలయంలో కుళ్లాయి స్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్శించుకున్నారు. అగ్ని గుండం వద్ద భక్తిశ్రద్ధలు పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం కుళ్లాయి స్వామికి నిత్య పూజ నివేదన నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

ప్రజా ప్రదక్షిణ వేదిక

తన ఇంటిని ఇతరులు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని హిందూపురం డీబీ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఇప్పటి వరకు 14 సార్లు అర్జీలిచ్చారు. అయినా కనీస స్పందన లేదు. దీంతో జిల్లా రిజిస్ట్రార్‌కు.. ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నిసార్లు తిరిగినా.. ఖర్చులు తప్ప ఉపయోగం లేదని బాధితుడు వాపోయాడు. పాలకులు, అధికారుల తీరుపై నమ్మకం పోయిందంటున్నాడు.

రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన ఓ కుటుంబం కొన్నేళ్లుగా కర్ణాటకలో నివాసం ఉంటోంది. వారి భూమిని మూడు సర్వే నంబర్లలో కలిపి 5 ఎకరాలను పేరూరు గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు ఆన్‌లైన్‌లో తమ పేరుపై ఎక్కించుకున్నారు. ఇటీవల ఆన్‌లైన్‌లో వన్–బీ చూడగా.. ఆ ఖాతా నంబరుపై మరొకరి పేరు వస్తుండటంతో బాధితులు మండల, డివిజన్ స్థాయిలో అర్జీలిచ్చారు. ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్‌కు వెళ్లి వరుసగా మూడు వారాలు అర్జీలిచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని బాధితులు వాపోయారు.

- తూతూ మంత్రంగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- అర్జీలన్నీ బుట్టదాఖలు.. పరిష్కారమైనట్లు మెసేజ్‌లు
- ప్రతి వారం కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చినా ఫలితం శూన్యం
- కూటమి సర్కారు తీరుపై జనం లబోదిబో

సాక్షి, పుట్టపర్తి

"ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇస్తే చాలా... ఎంతటి సమస్యనైనా అధికారులే మీ వద్దకు వచ్చి పరిష్కరిస్తారు" అంటూ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఫిర్యాదు చేస్తే.. ఆన్‌లైన్ ద్వారా నేరుగా సీఎంఓకు చేరుతుందని, గంటల వ్యవధిలోనే స్పందన వస్తుందంటూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. నిజమే అనుకున్న జనం కలెక్టరేట్ వరకూ తమ సమస్యపై అర్జీ ఇస్తే అవన్నీ బుట్టదాఖలవుతున్నాయి. దీంతో జనం ఒకే సమస్యపై పదేపదే అర్జీలిస్తున్నారు. అయినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. పైగా సమస్య పరిష్కారమైనట్లు సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తుండటంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తున్న దృశ్యం



కలెక్టరేట్ ప్రాంగణంలో అర్జీలు రాసే ప్రాంతంలో జనాల రద్దీ

10,187	పరిష్కార వేదికకు అందిన అర్జీలు
5,934	రెవెన్యూకు సంబంధించిన అర్జీలు
2,313	సర్వే సమస్యలపై వచ్చినవి
7,302	పరిష్కరించినట్లు చూపుతున్నది
2,885	పెండింగులో ఉన్న అర్జీలు

(వివరాలన్నీ జనవరి 1 నుంచి జూన్ 30 వరకు)

రెవెన్యూ సమస్యలే అధికం..

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రతి సోమవారం వివిధ సమస్యలపై ప్రజల నుంచి సగటున 500 వరకు అర్జీలు అందుతుంటాయి. అందులో 400 వరకు (80 శాతం) రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయి. సాగులో ఒకరుంటే.. ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఉంటోంది. భూమి ఒకరి పేరు మీద ఉంటే.. ఇద్దరి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు బయటకు వస్తున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కూటమి నాయకులే భూ కబ్జాలకు పాల్పడుతుండటంతో ఏడాది వ్యవధిలోనే భూ తగాదాలు భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో జనం మండల, డివిజన్ స్థాయి తొలుత ఫిర్యాదు చేస్తున్నారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలిస్తున్నారు. అయితే కలెక్టరేట్‌లో ఇచ్చిన అర్జీని మళ్లీ డివిజన్ లేదా మండల అధికారులకే పంపుతుండటంతో సమస్యల పరిష్కారం అటకెక్కుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని ప్రదక్షిణ..

జిల్లాలో 32 మండలాలుండగా.. తనకల్లు, నల్లచెరువు, అమడగూరు, అమరాపురం, రొళ్ల, గుడిబండ, అగళి, రామగిరి, కనగానపల్లి, పరిగి మండలాలు జిల్లా కేంద్రానికి చాలా దూరంలో ఉంటాయి. ఓసారి వచ్చి వెళ్లాలంటే రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతాయి. పైగా ఒకరోజు పనులు మానుకోవాల్సిందే. దీంతో ఆయా మండలాల వారు తమ సమస్యలపై తొలుత స్థానిక మండల, డివిజన్ స్థాయిలోనే ఫిర్యాదు చేస్తున్నారు. అక్కడ పరిష్కారం కాకపోవడంతో వ్యయ, ప్రయాసల కోర్చి పుట్టపర్తిలోని కలెక్టరేట్ వరకూ వస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలన్నింటినీ సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 266 అర్జీలు అందగా..వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వెళ్తే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, ఆర్డీఓ సువర్ణతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఉన్నత విద్య అభ్యసిస్తున్న 8 మంది విభిన్న ప్రతిభావంతులకు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సమకూర్చిన ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు.

ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదు..



నా వ్యవసాయ మోటర్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం రూ.1.40 లక్షలు చెల్లించాను. ఏడాది కావస్తున్నా.. ఇప్పటి వరకు మెటీరియల్ ఇవ్వలేదు. కేవలం స్తంభాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నాతో డబ్బులు తీసుకున్న ఏఈ బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన వాళ్లేమో.. మాకు తెలీదంటున్నారు. ఇప్పటికే విద్యుత్ ఎస్ఈ కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌లో ఎనిమిది సార్లు అర్జీలిచ్చినా పట్టించుకున్న వారే లేరు.

– రాజా, కొండకమర్ల, ఓడీ చెరువు మండలం

నడవలేని స్థితిలోనూ.. వస్తూనే ఉన్నా



నా భూమిని మరో వ్యక్తి ఆక్రమించాడు. పట్టా పాసు పుస్తకాలు చేయించుకుని నన్ను రానివ్వడం లేదు. ఇప్పటికే ఆరుసార్లు కలెక్టరేట్‌లో అర్జీలిచ్చిన.. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అంతకుముందు తనకల్లు తహసీల్దార్, కదిరి ఆర్డీఓ కార్యాలయాల్లోనూ ఫిర్యాదు చేశాను. నాకు ఆరోగ్యం సరిగా లేదు. నడవలేని స్థితిలో పలుమార్లు కలెక్టరేట్‌కు వస్తున్నా.. నా భూమిని నాకు అప్పజెప్పలేకపోతున్నారు. పరిష్కరిస్తామని చెబుతుండటంతో ఆశతో వస్తున్నా.

– కొండప్పనాయక్, మల్లిరెడ్డిపల్లి, తనకల్లు మండలం

పంచాయతీకే పంగనామం

- పేరూరు పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ దౌర్జన్యం
- ఏడాదిగా చెత్త తరలించే ట్రాక్టర్‌ను బాడుగకు పంపుతున్న వైనం
- మిగతా చోట్లా ఇదే రీతిలో దోచుకుంటున్నారన్న విమర్శలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఇది రామగిరి... ఇక్కడ మేం ఏమైనా చేయగలం... అందినకాడికి దోచుకుంటాం ... లేదంటే లాక్కుంటాం.. అంటూ టీడీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలమైన రామగిరి మండలంలోని పేరూరు పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ బాగోతం బయటపడింది. పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గత సంవత్సర కాలంగా సొంత పనులకు వాడుకోవడమే కాదు రోజూ చుట్టు పక్కన ఉన్న గ్రామాల రైతులకు బాడుగలకు పంపుతూ అందినకాడికి దోచుకుంటున్నాడు. అంతేకాదు ఏకంగా ట్రాలీని సమీపంలోని కర్ణాటక ప్రాంతంలోని సోలార్‌కు లీజ్‌కు ఇచ్చాడంటే ఎంత ఘనుడో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని అధికారులు..

గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. అలాగే పంచాయతీ అభివృద్ధికి చెత్త తరలింపునకు ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆయా ట్రాక్టర్లను టీడీపీ నాయకులు తమ ఆధీనంలో ఉంచుకొని సొంత పనులకు వాడుకుంటుండటం గమనార్హం. పేరూరులోనే కాదు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇదే రీతిలో ట్రాక్టర్లను సొంతానికి వాడుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. కనీసం ఇప్పటికైనా డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి పవన్‌కల్యాణ్ ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా పంచాయతీల్లో ట్రాక్టర్లను వెనక్కు తీసుకొని పంచాయతీల అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పేరూరు పంచాయతీకి చెందిన ట్రాక్టర్ రైతుల పొలంలో దున్నడానికి సిద్ధంగా ఉన్న దృశ్యం

'మోడల్' సీట్లు అమ్ముకుంటున్నారు

- ఆవేదన వ్యక్తం చేస్తూ కనగానపల్లి మోడల్ పాఠశాల వైస్ చైర్మన్ సోషల్ మీడియాలో పోస్ట్



కనగానపల్లి మోడల్ స్కూల్లో అడ్మిషన్ కోసం వచ్చిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కనగానపల్లి మోడల్ స్కూల్ ప్రవేశాల వ్యవహారం చర్చనీయాంశమైంది. సాక్షాత్తు ఆ పాఠశాల వైస్ చైర్మన్, టీడీపీ నాయకుడు పోతలయ్య తన ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా ద్వారా ఎమ్మెల్యే పరిటాల సునీతకు వివరిస్తూ ఓ పోస్టు పెట్టారు. ఈ పోస్టు నియోజకవర్గంలో దుమారం రేపుతోంది.

ఏం జరిగిందంటే...

కనగానపల్లి మోడల్ స్కూల్‌లో 6 నుంచి ఇంటర్ వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతికి 40 సీట్లు ఉంటాయి. వసతి గృహంలో మాత్రం 100 సీట్లే అందుబాటులో ఉన్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే కౌన్సెలింగ్ ద్వారా పలువురికి ప్రవేశాలు కల్పించారు. తాజాగా సోమవారం మిగులు సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో పాఠశాల వైస్ చైర్మన్, టీడీపీ నాయకుడు పోతలయ్య పాఠశాల వద్దకు వెళ్లి అర్హులైన విద్యార్థినులకు సీట్లు ఇవ్వాలని కోరారు. అయితే ప్రిన్సిపాల్ రవికిరణ్ సీట్లు లేవని చెప్పడంతో అతను కంగుతిన్నాడు. మిగులుసీట్లు ఎవరికిచ్చారు..ఎలా ఇచ్చారని ప్రశ్నించగా..ప్రిన్సిపాల్ సమాధానం చెప్పలేదు. కాగా, డబ్బులు తీసుకుని సీట్లు కేటాయించారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించడంతో పోతలయ్య వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి కనగానపల్లి మోడల్ స్కూల్‌లో జరిగిన అడ్మిషన్ల కుంభకోణాన్ని పరిటాల సునీతకు వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ రవికిరణ్ సీట్లు అమ్ముకుంటూ అర్హులైన పేద విద్యార్థినులకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే స్పందించి ప్రిన్సిపాల్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పోస్టు సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారి తీవ్ర చర్చకు దారితీసింది.

ఫెన్సింగ్ పోటీల్లో జస్వంత్‌రెడ్డి సత్తా



సిల్వర్ మెడల్ అందుకుంటున్న జస్వంత్‌రెడ్డి

తలుపుల : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తొగటవాండ్లపల్లికి చెందిన బి.రామాంజులురెడ్డి, సరస్వతి దంపతుల కుమారుడు బి.జస్వంత్‌రెడ్డి సత్తా చాటాడు. జూన్ 29న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన అండర్ –10 మినీ స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ఇప్పి విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. అనంతపురం ఎంకే స్పోర్ట్ అకాడమీలో ఫెన్సింగ్‌లో జస్వంత్‌రెడ్డి శిక్షణ తీసుకున్నాడు. సిల్వర్ మెడల్ పొందినందుకు జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా సెక్రటరీ సరస్వతి, స్పోర్ట్ అకాడమీ కోచ్ రాహుల్ అభినందించారు. జూలై 5, 6, 7 తేదీల్లో జరగనున్న మినీ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో జస్వంత్ పాల్గొననున్నట్లు కోచ్ రాహుల్ తెలిపారు.

అత్యాచారాలు.. దోపిడీలు

- హిందూపురంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు
- ఏడాది కాలంలోనే పెచ్చుమీరిన హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు
- డీఎస్పీతో పాటు నలుగురు సీఐలున్నా ప్రయోజనం శూన్యం
- భయాందోళనలో నియోజకవర్గ ప్రజానీకం



గతేడాది అక్టోబర్‌లో అత్తాకోడలిపై జరిగిన అత్యాచార ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎస్పీ (ఫైల్)



కిరికెరలో దోపిడీ జరిగిన ప్రాంతంలో పోలీసుల హడావుడి



లేపాక్షి మండలంలో దారుణ హత్యకు గురైన రవికుమార్(ఫైల్)



2024 జూలైలో టీడీపీ నేతల చేతిలో హతమైన సతీష్(ఫైల్)

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గంలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, చోరీలు పెచ్చుమీరిపోతున్నాయి. రోజుకో చోట ఘటనలు వెలుగుచూస్తుండటంతో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. ఏడాదిగా నియోజకవర్గంలో రోజూ ఏదో ఒక ఘటన జరుగుతున్నా, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. సంఘటన జరిగిన తర్వాత హడావుడి చేసే పోలీసు యంత్రాంగం ముందస్తుగా నేరాలను తగ్గించేందుకు ఎందుకు ప్రయత్నించడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

అత్తాకోడలిపై అత్యాచారంతో మొదలు..

కూటమి సర్కార్ కొలువుదీరాక హిందూపురం నియోజకవర్గంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. పోలీసులు ఎవరినైనా పట్టుకున్నా.. వెంటనే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ వస్తోంది. దీంతో పోలీసులు తమకెందుకని భావించి తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు. దీంతో ఏడాది కాలంలో హిందూపురంలో అకృత్యాలు, దౌర్జన్యాలతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది.

- చిలమత్తూరు మండలంలో గతేడాది అక్టోబరులో కొందరు దుండగులు అత్తాకోడలిపై అత్యాచారం చేయడం రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. అప్పుడు ప్రారంభమైన నేరాల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది. మొన్న చౌళూరులో అత్యాచార యత్నం, నేడు తూముకుంటలో హత్య, కిరికెరలో భారీ దోపిడీ...ఇలా ఏడాదిగా హిందూపురం..నేరస్తుల పరమైంది.
- చిలమత్తూరు మండలంలోని కందుర్పర్తి, చౌళూరు గ్రామాల్లో బాలికలపై జరిగిన అత్యాచార యత్నాలు కూడా కూటమి సర్కార్ హయాంలో చోటుచేసుకున్నవే.
- 2024 జూలైలో హిందూపురం మండలంలోని గొల్లాపురంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త సతీష్‌ను టీడీపీ నేతలు దారుణంగా కొట్టి చంపారు. నిందితులను రిమాండ్‌కు పంపి పోలీసులు చేతులు దులుపుకోవడంతో వారు బెయిల్‌పై బయటకు వచ్చి బాధితులను బెదిరిస్తున్నారు. పైగా తమకు ఎవరు అడ్డుచెప్పినా అంతం చేస్తామంటూ దుర్మార్గాలకు ఒడిగడుతున్నారు.
- తాజాగా ఈనెల 26వ తేదీన లేపాక్షి మండలం మైదుగోళంలో రవికుమార్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గంగోత్రి బార్ వద్ద ఆటోడ్రైవర్ అశోక్‌తో జరిగిన గొడవలో అతను మృత్యువాత పడ్డాడు. ఇక పేకాట, అక్రమ మద్యం, మట్కాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. పోలీసుశాఖలోని కొందరి అండతోనే అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

పెరిగిపోయిన దోపిడీలు, దొంగతనాలు

- హిందూపురం రూరల్ మండలంలోని కిరికెర గ్రామం వెంకటాద్రి లేఅవుట్‌లో ఈనెల 26వ తేదీ రాత్రి నిత్యానందరెడ్డి ఇంట్లో జరిగిన భారీ దోపిడీ నియోజకవర్గంలో జరిగిన మరో సంచలనం. దుండగులు తుపాకులతో బెదిరించి మరీ 25 తులాల బంగారు నగలను దోపిడీ చేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వెంకటాద్రి లేఅవుట్‌లో ఈ ఘటన జరగడం గమనార్హం. ఈ ఘటన పోలీసుల వైఫల్యానికి అద్దం పడుతోంది. నిందితులను పట్టుకోవడానికి ఎనిమిది బృందాలు రంగంలోకి దిగినా.. ఇంత వరకూ కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు.
- మరవకొత్తపల్లి బీసీ కాలనీలోనూ పట్టపగలే దుండగులు చోరీ చేసి బంగారం ఎత్తుకెళ్లారు. డ్రోన్‌లతో నిఘా పెంచుతామని ప్రకటించుకున్న పోలీసులు ఆ దిశగా అడుగులు కూడా వేయలేదు. సీసీ కెమెరాల ఏర్పాటులోనూ అలసత్వం కనిపిస్తోంది. చిలమత్తూరు మండలంలో గతేడాదిగా కొడికొండ చెక్‌పోస్ట్‌తో పాటుగా మండలంలోని పలు చోట్ల బైక్ దొంగతనాలు, ఇళ్లలో చోరీలు కూడా జరిగాయి. అయినా పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారు.

పట్టించుకోని ఎమ్మెల్యే బాలకృష్ణ

సినీనటుడు బాలకృష్ణ హిందూపురం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన ఎప్పుడో చుట్టం చూపుగా హిందూపురం వచ్చి వెళ్తుంటారు. పాలన అంతా పీఏల కనుసన్నల్లోనే సాగుతోంది. ఈ క్రమంలో నియోజకవర్గంపై పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. దీంతో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. ముఖ్యంగా పోలీసు శాఖ అధ్వాన్నంగా తయారైందని స్థానికులే చెబుతున్నారు. డీఎస్పీతో పాటు నలుగురు సీఐలు ఉన్నా ఫలితం లేకుండా పోయిందంటున్నారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 60 వినతులు



సమస్య తీవ్రత తెలుసుకుంటున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్‌: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 60 వినతులు అందాయి. వినతులను ఎస్పీ రత్న స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. మహిళలు, వికలాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్‌ అడ్వైజర్‌ సాయినాథ్‌రెడ్డి, డీఎస్పీ విజయకుమార్‌, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

'108'లో ప్రసవం



నవజాత శిశువును అందిస్తున్న ఈఎంటీ మంజుల

మడకశిర రూరల్‌: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు.. మడకశిర మండలం హెచ్‌ఆర్‌ పాళ్యం గ్రామానికి చెందిన గర్భిణి మహాలక్ష్మికి ఆదివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్‌ సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుని గర్భిణిని పావగడలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్‌ తిమ్మప్ప సాయంతో ఈఎంటీ మంజుల ఆమెకు కాన్పు చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి ఈ సందర్భంగా బాలింత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆత్మహత్యాయత్నం కాదు.. హత్యాయత్నం!'

ధర్మవరం అర్బన్‌: స్థానిక గీతానగర్‌కు చెందిన వివాహిత రమాదేవిని ఆదివారం రాత్రి ఫిట్స్‌ వచ్చాయంటూ కుటుంబ సభ్యులు ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమాదేవిని ఆమె పుట్టింటి తరఫు బంధువులు వెళ్లి పరామర్శించారు. రమాదేవికి ఫిట్స్‌ రాలేదని ఉరి వేసి హత్య చేయాలని చూశారంటూ అనంతపురంలోని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ధర్మవరం వన్‌టౌన్‌ సీఐ నాగేంద్రప్రసాద్‌ స్పందించి ఓ కానిస్టేబుల్‌ను అనంతపురంలోని ఆసుపత్రికి పంపించారు. వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిందా? లేక ఎవరైనా హత్య చేసేందుకు ప్రయత్నించారా? అనేది తేలాల్సి ఉంది.

బదిలీల నరకయాతన



అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వేచి ఉన్న మహిళా పోలీసులు



తల్లులు కౌన్సెలింగ్‌కు వెళ్లడంతో చంటిపిల్లలను నిద్రపుచ్చుతున్న కుటుంబ సభ్యులు



సౌకర్యాలు కల్పించకపోవడంతో చెట్ల కింద నిరీక్షిస్తున్న దృశ్యం

అనంతపురం: ఉమ్మడి జిల్లా సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది బదిలీల ప్రక్రియ నరక యాతనను మిగిల్చింది. అనంతపురంలోని డీపీఓలో చేపట్టిన ఈ ప్రక్రియకు ఉదయం 8 గంటలకంతా హాజరు కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మధ్యాహ్నం 12 గంటలైనా కౌన్సెలింగ్‌ ప్రక్రియ చేపట్టలేదు. 12 గంటల తర్వాత తొలుత స్పౌజ్‌, పీహెచ్‌సీ, మెడికల్‌ సర్టిఫికెట్‌ ఉన్న వారికి కౌన్సెలింగ్‌ చేపట్టారు. మూడు గంటల వరకు జనరల్‌ కౌన్సెలింగ్‌ ప్రారంభించలేదు. తెల్లవారుజామున మూడు గంటల వరకు కౌన్సెలింగ్‌ ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో నిరీక్షణ తప్పలేదు. దీంతో చంటి పిల్లల తల్లులు, దూరప్రాంతాల నుంచి వచ్చిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. అవివాహితులకు తోడుగా వచ్చిన తల్లిదండ్రులను లోపలకు అనుమతించకపోవడంతో వారు బయటే నిరీక్షించాల్సి వచ్చింది. మహిళల పట్ల పోలీసు శాఖ నిర్దయగా వ్యవహరిస్తోందని విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరకు ఆదోనిలో ఓ మహిళా కానిస్టేబుల్‌ చనిపోయిన విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు స్పందించి ఆగమేఘాలపై పిల్లల తల్లులకు పాలు, జ్యూస్‌ అందించారు. కౌన్సెలింగ్‌ కేంద్రంపైన సేద తీరేందుకు అవకాశం కల్పించారు.

స్పౌజ్‌ కోటాలో అభ్యంతరాలు

స్పౌజ్‌ కోటాలో బదిలీలకు సంబంధించి తమ భర్త ఎక్కడ ఉంటాడో ఆ పరిసరాల్లోనే స్థానాన్ని కోరుకోవాలి. అయితే తాడిపత్రి, హిందూపురం పరిసరాల్లో పనిచేస్తున్న కొందరు ఇతర ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వారిని స్పౌజ్‌ పరిసర ప్రాంతాల్లోని స్థానాలు కేటాయించారు.

అర్ధరాత్రి ఆందోళన: గణనీయమైన ర్యాంకు ఉన్న వారికి ముందుగా అవకాశం కల్పించి వారు కోరుకున్న చోటు కేటాయించాలి. అలాగే రేషనలైజేషన్‌లో పోస్టు కోల్పోయిన వారికి జనరల్‌ కేటగిరి కింద చివరన పిలవాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా కౌన్సెలింగ్‌ చేపట్టారు. దీంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యపు సమాధానంతో పరిస్థితి అదుపు తప్పి అర్ధరాత్రి కౌన్సెలింగ్‌ ఆగిపోయింది. తిరిగి అధికారులు నచ్చచెప్పి కౌన్సెలింగ్‌ను కొనసాగించారు.



బయటి నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని తింటున్న దృశ్యం



తల్లి కౌన్సెలింగ్‌కు వెళ్లడంతో చిన్నారులకు ఆహారం తినిపిస్తున్న తండ్రి

వివాహేతర సంబంధంతోనే హత్య

- యువకుడి హత్యకేసులో వీడిన మిస్టరీ
- నిందితుల అరెస్ట్‌



నిందితులను అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

హిందూపురం: మూడు రోజుల క్రితం లేపాక్షి మండలంలో చోటు చేసుకున్న యువకుడి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా నిర్ధారిస్తూ ఇద్దరిని అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించారు. హిందూపురంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ మహేష్‌ వెల్లడించారు. గత నెల 24వ తేదీ రాత్రి 10 గంటల నుంచి లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్‌ (36) కనిపించకపోడంతో ఆయన తండ్రి బోయ అశ్వత్థప్ప ఫిర్యాదు మేరకు అదే నెల 25న పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఆనంద్‌, గోవిందరాజుపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. అందిన సమాచారం మేరకు గత నెల 25న రాత్రి గ్రామ శివారులోని నీటి కుంటలో బయటపడిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అశ్వత్థప్ప కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం తన భర్తదేనంటూ రవికుమార్‌ భార్య గీత నిర్ధారించింది. దీంతో మిస్సింగ్‌ కేసును కాస్త గీత ఫిర్యాదుతో హత్య కేసుగా మార్చి దర్యాప్తు వేగవంతం చేశారు. అనుమానితులైన గోవిందరాజు, ఆనంద్‌ను సోమవారం మధ్యాహ్నం మైదుగోళం సమీపంలో హిందూపురం రూరల్‌ సీఐ జనార్దన్‌, లేపాక్షి ఎస్‌ఐ నరేంద్ర అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో తామే హత్య చేసినట్లుగా అంగీకరించారు. ఆనంద్‌ భార్యతో రవికుమార్‌ వివాహేతర సంబంధం కొనసాగించేవాడని, ఈ విషయంగా పలుమార్లు మందలించినా అతని తీరు మారకపోవడంతో హతమార్చాలని నిర్ణయించుకున్నట్లుగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో గత నెల 24న సాయంకాలం మందు పార్టీ ఏర్పాటు చేసుకుందామని ఆనంద్‌ తెలపడంతో రవికుమార్‌ తన ఇంటి నుంచి చికెన్‌ చేయించుకుని బాక్స్‌లో తీసుకుని ఆనంద్‌, అతని తమ్ముడు గోవిందరాజుతో కలసి మైదుగోళం శివారులోని కురుబ లింగప్ప బీడు భూమికి చేరుకున్నారు. అక్కడ చాలా సేపటి వరకూ మద్యం తాగుతూనే ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో రవికుమార్‌ మద్యం మత్తులో జోగుతుండగా ఇదే అదునుగా భావించి అన్నదమ్ములు ముందుగానే సిద్ధం చేసుకున్న వేటకొడవలితో నరికారు. మొండెం నుంచి వేరుపడిన తలను ప్లాస్టిక్‌ సంచిలో వేసి, మొండెంతో పాటు లింగప్ప పొలంలోనే ఉన్న నీటి కుంటలో పడేసి వెళ్లిపోయారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో వారి నుంచి హత్యకు ఉపయోగించిన వేటకొడవలి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కూటమి పాలనలో పీఆర్‌ వ్యవస్థ నిర్వీర్యం

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్‌ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి
- కలెక్టరేట్‌ ఎదుట ధర్నా



కలెక్టర్‌ చేతన్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేష్‌రెడ్డి, తదితరులు

ప్రశాంతి నిలయం: కూటమి ప్రభుత్వ అశాస్త్రీయ నిర్ణయాలతో పంచాయతీ రాజ్‌ (పీఆర్‌) వ్యవస్థ నిర్వీర్యమైందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్‌ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ రాజ్‌ వ్యవస్థలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌కు వినతి పత్రం అందించి, మాట్లాడారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,150 కోట్లను కూటమి ప్రభుత్వం దారి మళ్లించడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఈ నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్‌ చేశారు. కూలీలకు దక్కాల్సిన ఉపాధి నిధులను టీడీపీ నేతలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. సర్పంచులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ వారి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించకుండా చేసి ఆ డబ్బులనూ కూటమి ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. తక్షణం సర్పంచుల పిల్లలకు తల్లికి వందనం పథకం లబ్ధి చేకూర్చాలని కోరారు. బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించి, రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 73, 74 సవరణల మేరకు సర్పంచులకు అధికారాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోస్టింగ్‌ కోసం ఎదురు చూస్తున్న 1,320 మంది పంచాయతీ కార్యదర్శులకు తక్షణమే పోస్టింగ్‌ ఇచ్చి పెండింగ్‌లో ఉన్న 9 నెలల వేతనం విడుదల చేయాలన్నారు. సర్పంచ్‌, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనం పెంచడంతో పాటు వేతనాలను సకాలంలో చెల్లించాలన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌ వినోద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్‌ విభాగం అధ్యక్షులు కులశేఖరరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, రేగాటిపల్లి ఎంపీటీసీ రవీంద్ర రెడ్డి, మంజునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్‌ విభాగం నాయకులు కొండారెడ్డి, భోగి కొండారెడ్డి, విశ్వనాథరెడ్డి, అశ్వత్థరెడ్డి, రాజారెడ్డి, సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై విచారణ చేపట్టాలి

- ఆర్‌డీకి ఏపీ సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకుల ఫిర్యాదు

అనంతపురం కార్పొరేషన్‌: సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని, వీటిపై తక్షణమే విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలంటూ మునిసిపల్‌ ఆర్‌డీ విశ్వనాథ్‌ను ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్‌డీ కార్యాలయంలో సోమవారం ఆర్‌డీని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. స్పౌజ్‌కు సంబంధించి తప్పుడు సర్టిఫికెట్లు అందజేసిన కొందరు జిల్లా కేంద్రానికి బదిలీ పొందారని, వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డీను కలసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీవీ రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌.మహబూబ్‌ బాషా, ప్రధాన కార్యదర్శి పులిబండ్ల నరసింహారావు, పెద్ద సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే దివ్యాంగుల, స్పౌజ్‌ సర్టిఫికెట్లలో అక్రమాలకు పాల్పడి జిల్లా కేంద్రానికి కొందరు బదిలీ పొందారని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డీకి సచివాలయ ఉద్యోగులు కన్నయ్య, మహేష్‌ నాయక్‌, కవితమ్మ, బాలాజీ యాదవ్‌ ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో టీడీపీ నేత

- సొంత పార్టీ నేతపై దాడిలో ప్రమేయం

పెనుకొండ/రూరల్‌: మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ చిన్న వెంకటరాముడిని కొత్తచెరువు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల మునిమడుగుకు చెందిన టీడీపీ నాయకుడు అంజనేయులు అలియాస్‌ బేనీషా కొత్తచెరువు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు హుటాహుటిన అనంతపురంలోని ఆస్పత్రికి తరలించి కాపాడుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అంశాన్ని ఎస్పీ రత్న తీవ్రంగా పరిగణించి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించడంతో దాడికి కారకులైన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో దాడికి తమను ప్రేరేపించింది చిన్న వెంకటరాముడని వారు అంగీకరించినట్లు సమాచారం. దీంతో సోమవారం వేకువజామున చిన్న వెంకటరాముడిని కొత్తచెరువు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన ముగ్గురితో పాటు చిన్న వెంకటరాముడిని సీరియస్‌గా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం చర్చనీయాంశమైంది.

ట్రాక్టర్‌ కింద పడి విద్యార్థి మృతి



జశ్వంత్‌ (ఫైల్‌)

లేపాక్షి: మండలంలోని ఉప్పరపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు కుమారుడు జశ్వంత్‌(19) ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని పాలిటెక్నిక్‌ కళాశాలలో డిప్లొమా ఫైనలియర్‌ చదువుతున్న జశ్వంత్‌ ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం శ్రీనివాసులు పంటకు నీరు కట్టేందుకు వెళ్లిన సమయంలో జశ్వంత్‌ తోడు వెళ్లాడు. పంటకు తాను నీరు కడతానని, ఇతర పనులేమైనా ఉంటే చూసుకోవాలని తెలపడంతో పని అప్పగించి తండ్రి ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత పక్క పొలం రైతు పొలంలోకి ట్రాక్టర్‌తో మట్టిని తరలిస్తుండడం గమనించిన జశ్వంత్‌... డ్రైవర్‌ను మాట్లాడించేందుకు వెళ్లాడు. ట్రాక్టర్‌ ఇంజన్‌కు ట్రాలీకి మధ్యలో నిలబడి మాట్లాడుతూ పొలం వైపుగా వెళుతుండగా అదుపు తప్పి ట్రాలీ చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్‌ వెంటనే ట్రాక్టర్‌ను ఆపి క్షతగాత్రుడిని బయటకు లాగి 108 వాహనంలో చికిత్స నిమిత్తం హిందూపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరవకొండలో రెచ్చిపోయిన దొంగలు

- వేర్వేరు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల్లో నుంచి నగదు అపహరణ

ఉరవకొండ: స్థానిక బ్యాంక్‌ల వద్ద దొంగలు రెచ్చిపోయారు. వేర్వేరు బ్యాంక్‌ వద్ద కాపు కాచి ఖాతాదారుల నగదు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు.. మోపిడి గ్రామానికి చెందిన రైతు గొర్తి శ్రీనివాసులు వేరుశనగ పంట సాగు పెట్టుబడుల కోసం సోమవారం ఉరవకొండలోని యూనియన్‌ బ్యాంక్‌కు చేరుకుని రెండు తులాల బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.80 వేలు నగదు తీసుకున్నాడు. ఈ నగదును తన ద్విచక్ర వాహనంలోని బ్యాగ్‌లో ఉంచుకుని బయలుదేరుతుండగా తెలిసిన వ్యక్తి పలకరించడంతో వాహనం దిగి మాట్లాడాడు. అనంతరం వాహనం వద్దకు వచ్చి చూడగా డబ్బు కనిపించలేదు.

- మరో ఘటనలో

విడపనకల్లు మండలం చీకులగురికి గ్రామానికి చెందిన రైతు ఓబులేసు తన కుమారుడు ఇంజినీరింగ్‌ ఫీజు చెల్లించేందుకు డబ్బు అవసరమై భార్యతో కలసి ఉరవకొండ పోలీసుస్టేషన్‌ వెనుక ఉన్న స్టేట్‌బ్యాంకుకు సోమవారం వెళ్లాడు. తన భార్యకు చెందిన 3 తులాల బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.1.30 లక్షలు తీసుకున్నాడు. ఈ డబ్బును తన ద్విచక్ర వాహనం బ్యాగ్‌లో ఉంచుకుని తిరుగు ప్రయాణమైన దంపతులు.. .స్థానిక క్లాక్‌టవర్‌ వద్ద కాయగూరలు కొనుగోలు చేసేందుకు ఆగారు. భార్య కాయగూరలు కొనుగోలు చేస్తుండగా భర్త వాహనంపైనే కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో ఓ దుండగుడు బైక్‌ సైడ్‌ బ్యాగ్‌లోని నగదును అపహరించాడు. భార్య వాహనం వద్దకు వచ్చిన తర్వాత పరిశీలిస్తే సైడ్‌ బ్యాగ్‌లో ఉంచిన నగదు కనిపించలేదు. తన కుమారుడి చదువుల కోసం భార్య నగలు తాకట్టు పెట్టి తీసుకున్న డబ్బును దుండగులు అపహరించడంతో ఓబులేసు ఆవేదనకు అంతులేకుండా పోయింది. ఫీజు చెల్లించకపోతే కుమారుడి చదువులు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ రెండు ఘటనలపై బాధితులు చేసిన ఫిర్యాదు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి టౌన్‌: అర్హులైన లబ్ధిదారులకు జూలై నెలకు సంబంధించి పింఛన్లను మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 2,60,883 మంది లబ్ధిదారులకు రూ 114.09 కోట్లు మంజూరు కాగా, ఇందుకు సంబంధించిన నగదును సోమవారం బ్యాంక్‌ల నుంచి విత్‌డ్రా చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే 2వ తేదీ కూడా పంపిణీ ప్రక్రియ ఉంటుంది.

నేటి నుంచి తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు



ఆచార్య తూమాటి దోణప్ప (ఫైల్‌)

ఉరవకొండ: తెలుగు సాహితీ విజ్ఞాన గని, బహుభాషా పండితుడు ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి వేడుకలు మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన దోణప్ప 1926, జూలై 1న సంజప్ప, తిమ్మక్క దంపతులకు జన్మించారు. ఆంధ్ర యూనివర్సిటీ, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో తెలుగు ఆచార్యులుగా పనిచేశారు. హైదరాబాదులో ఆవిర్భవించిన తెలుగు విజ్ఞాన పీఠం డైరెక్టరుగా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు. ఆయన సాహితీ సేవలకు గుర్తుగా తెలుగు సాహితీ జగత్తు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహకాలు చేసింది.

గురుకులాల్లో ఇంటర్‌ మిగులు సీట్లకు కౌన్సెలింగ్‌

అనంతపురం రూరల్‌: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో ఇంటర్‌ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయ సమన్వయ అధికారి జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ నుంచి సమాచారం అందిన విద్యార్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఈ నెల 2న బీ పప్పూరు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలలో బాలికలకు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, బాలురకు 2 నుంచి 4 గంటల వరకు కౌన్సెలింగ్‌ ఉంటుందన్నారు.

వ్యక్తి దుర్మరణం

పెనుకొండ: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లి మండలం వెలగమాకులపల్లికి చెందిన గంగాధర్‌(40) తన సోదరుడు భాస్కర్‌, కుమారుడు ప్రణీత్‌తో కలసి సోమవారం ద్విచక్ర వాహనంపై పెనుకొండకు బయలుదేరాడు. నగర పంచాయతీ పరిధిలోని రబ్బర్‌ ఫ్యాక్టరీ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొనడంతో గంగాధర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. భాస్కర్‌, ప్రణీత్‌ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇరు పార్టీల కార్యకర్తలపై సుమోటోగా కేసు నమోదు

తాడిపత్రి టౌన్‌: గత నెల 29న పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్న కారణంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన 20 మంది కార్యకర్తలపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్‌ తెలిపారు. వీరిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రవితేజారెడ్డి, నవీన్‌ రెడ్డి, హనుమంతరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ప్రణయ్‌ తదితరులు, అలాగే టీడీపీ కార్యకర్తలు మల్లికార్జున, పరమేష్‌, సుదర్శన్‌రెడ్డి, ఖాదర్‌, యాసిన్‌ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద మృతి

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె కుమార్‌(42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఉదయం మరో ఇద్దరు కూలీలతో కలసి అదే గ్రామానికి చెందిన జోగప్పగారి హనుమంతు ఇంటి నిర్మాణ పనుల్లో కుమార్‌ పాల్గొన్నాడు. మధ్యాహ్నం ఉన్నఫళంగా కుప్పకూలాడు. గమనించిన హనుమంతు, తదితరులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక కుమార్‌ మృతి చెందాడు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుమార్‌ కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్‌

యాడికి: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. యాడికిలోని అంకాలమ్మ వీధికి చెందిన వృద్ధుడు బోయ ఆదెప్ప మద్యం మత్తులో ఆదివారం సాయంత్రం ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆదెప్పపై పోక్సో యాక్ట్‌ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం మధ్యాహ్నం అరెస్ట్‌ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సజావుగా ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌

అనంతపురం మెడికల్‌: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌ ప్రక్రియ సజావుగా జరిగింది. ఉమ్మడి జిల్లాలోని 803 మంది ఏఎన్‌ఎంలకు జూమ్‌ వీడియో ద్వారా డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ భ్రమరాంబదేవి బదిలీల కౌన్సెలింగ్‌ చేపట్టారు. అర్ధరాత్రి వరకూ ఈ ప్రక్రియ సాగింది. సీనియర్‌ అసిస్టెంట్‌ కమలాకర్‌ రాజు, తదితరులు పాల్గొన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 740 మందికి వారి సీనియారిటీ, ప్రగతి ఆధారంగా పోస్టింగ్‌ కల్పించారు.